# కొత్త కాపురం

## — సూరేపల్లి విజయ

ఈ మహానగరంలో రూపాయి పెట్టినా ఎన్ని పూలో రావు. అలాంటిది తలనిండా పూలతో సాయంత్రం శ్రీవారికి స్వాగతం చెప్పాలని మధ్య తరగతి రతి కోరిక. ఊళ్లోవాళ్ల ఇంట్లో వున్న సన్న జాజి పందిరికి ఎన్ని పూలో! పూలు పెట్టుకొమ్మని వాళ్లమ్మ మాల కట్టిస్తే అప్పట్లో అంత శ్రద్ధ వుండేది కాదు. ఆమె భర్త రవితేజకు మల్లెపూలంటే చాలా ఇష్టం. అతను ఆఫీసు నుండి వచ్చేట ప్పుడు, మల్లెచెండు మూరెడైనా పట్టుకొస్తాడు. తెచ్చిన పూలను జడలో పెట్టి, ఎత్తుకొని గిరగిరా తిప్పాలని ఆమె ఆశ. కాని వున్నవి రెండే రెండు ఇరుకు గదులు. అజాగ్రత్తగా ఎటు రెండడుగులు వేసినా ఏదో ఒకటి తగలడం ఖాయం. అందులో ఒకటి వంట గది. రెండోది అన్నిటికి. ఆ వంట గదిలోనే రాత్రి అత్తగారు పడుకుంటుంది. ఆవిడ పది దాటేవరకు గీతాపారాయణం చేస్తుంది. అప్ప టివరకు అతను 'రతి' పారాయణం చేస్తూ కూర్చుంటాడు. భర్త విరహబాధను చూసి ఆమె మన సులోనే నవ్వుకుంటుంది. ఆవిడ లైటు తీసేయగానే మొదలవుతుంది వాళ్ల అసంపూర్ణ ప్రేమా యణం. 'అసంపూర్ణ' అని ఎందుకంటున్నానంటే ఆవిడ ఎప్పుడు నిద్రపోయినట్టనిపించదు. అటు ఇటు కదులుతుంది. ఆవిడ సన్నగా గురక పెడితే వాళ్లకి కాస్త నిశ్చింత. అంతవరకు అతను భార్యను తనవైపు తిప్పుకొనటానికి ప్రయత్నిస్తుంటాడు.

ఆమె 'వద్దంటూనే' భర్తవైపు తిరుగుతుంది. అతడు మాగ్నెట్‌లాగా ఆమెను అతుక్కుపోతాడు. ఇంతలో ఆవిడ కదులుతుంది. ఆమె అతని పట్టు విడిపించు కొని అటు తిరుగుతుంది. రోజు ఇదే తంతు.

ప్రొద్దున్న ఇంటిముందున్న ఒక్క బండ ఊడ్చి తుడిచి దానిపై ముగ్గు పెడుతోంటే ఆమెకు తన పుట్టిల్లు గుర్తొచ్చింది. ఇంటిదగ్గర ఎంత పెద్ద వాకిలి! తెల్లవారేసరికి వాకిలి నిండా పూలు రాలిపడేవి. మంచుకు తడిసిన ఆ పూల వాసన గమ్మత్తుగా వుండేది. ఆ పరిమళాన్నాస్వాదిస్తూ నెమ్మదిగా తను వాకిలూడుస్తుంటే బామ్మ 'త్వరగా కానియ్' అని మొత్తుకునేది. ఆ పల్లెటూళ్లో విశాలమైన గదులు. ఇంటిచుట్టూ బోలెడంత ఖాళీ స్థలం. ఎక్కడ వున్నా ఎంత స్వేచ్ఛగా వుంటుంది. పట్టణంలోని ఈ గదులు తనకు జైళ్లలా వున్నాయి. అందులో అత్తగారుం టుంది. ఏకాంతమే కరువయింది. నిట్టూరుస్తూ లేచింది.

త్వరగా వంట ముగించి అతనికి భోజనం వడ్డిం చింది. అతను ఆఫీసుకెళ్లటానికి రెడీ అవుతుంటే, టిఫిన్ బాక్స్ తెచ్చి యిచ్చింది. అది అందుకొంటూ 'మామూలు' అన్నట్టుగా ఆమెవైపు చూశాడు. 'అదొ క్కటే తక్కువ' అన్నట్లు చూపులతోనే ఆమె సమా ధానం. ఆమె డల్‌గా వుందని గ్రహించి ''ఈరోజు సిని మాకెళ్దాం. రడీగా వుండు'' అని చెవిలో చెప్తున్నట్లుగా చెప్పి తన మామూలు తీసుకున్నాడు. భర్త చలాకీతనా నికి ముసిముసిగా నవ్వుకుంది.

సెలవుల్లో వెళ్లిన శేఖర్ ఆరోజే డ్యూటీలో జాయిన్ అయ్యాడు. ఆఫీసులోకి అడుగుపెట్టిన రవితేజను చూడగానే ''హాయ్! ఎలా వుంది కొత్త కాపురం?'' అంటూ పలకరించారు.

''గురుడు రోజుకెన్ని షోలేస్తున్నాడో అడుగు'' ఆత్రు తతో అన్నాడు ప్రక్కనే వున్న మూర్తి.

''ఆ కళ్లు చూస్తుంటే అసలు నిద్రపోయినట్టు లేదు'' కామెంట్ చేశాడు ఎదురుగా వున్న ప్రసాద్.

''వాణ్ణి చెప్పనివ్వండి'' మధ్యలో కల్పించుకున్నాడు శేఖర్.

''ఏం చెప్పమంటావు? రోజూ శివరాత్రి. జాగారం తప్పితే మరింకేం లేదు.''

''వాట్!?'' ముగ్గురు ఒక్కసారిగా అడిగారు.

''రతితోపాటు అమ్మ వచ్చింది. కొత్త కోడలికి వంట వార్పు నేర్పాలని. రెండు గదుల ఇంటికి వెయ్యి రూపా యల అద్దె ఇస్తున్నాను. ఈ గుమస్తా ఉద్యోగానికి అంత కంటే పెద్ద ఇల్లు ఎలా వస్తుంది? ఒక గదిలో మేము, ఇంకో గదిలో మా అమ్మ పడుకుంటాము. రాత్రంతా ఆమె నిద్రపోదు. ఊరికే మెసులుతుంది. ఆమె నిద్రపో నిదే రతి ఒప్పుకోదు. అదీ ప్రాబ్లం.''

''రెండు గదుల మధ్య తలుపు లేదా?'' అడిగాడు శేఖర్.

''ఉంది. తలుపు వేస్తాము. కాని కిటికీ తెరిచి వుంటుంది. అది కూడ మూసేస్తే మా అమ్మ 'గాలాడి చావట్లేదురా' అంటుంది.''

''అయితే మీరే లోపలి గదిలో పడుకోండి.''

''ఇది నీవు చెప్పాలా? ఆమాత్రం వాళ్లకూ తెలుసు. అలా వీలు కాదేమో! బహుశా లోపల గది చిన్నద యుంటుంది'' అన్నాడు మూర్తి.

''అవును. కరక్ట్‌గా చెప్పావు.''

''నువ్వేమనుకోనంటే నేనోటి చెప్పనా? రోజూ మీ అమ్మకో నిద్ర టాబ్లెటివ్వు'' సందేహిస్తూ సలహా యిచ్చాడు ప్రసాద్.

అతని వైపు కోపంగా చూశాడు రవితేజ.

''ప్రస్తుతానికి రేపెలాగూ ఆదివారం కనుక, ఏదైనా హోటల్‌లో ఒక రూం తీసుకొని హాయిగా ఎంజాయ్ చెయ్యండి'' చెప్పాడు శేఖర్.

''ఐడియా బాగుంది. కాని జేబులు ఖాళీ. మీలో ఎవరైనా ఒక ఐదొందలు అప్పుగా'' అంటూ నసిగాడు రవితేజ.

''సరే. ఈ ఐదొందలు తీసుకో. వడ్డీతోసహా ఫస్ట్‌కి తిరిగిచ్చెయ్యాలి.''

''అలాగే, తప్పకుండా. థాంక్యూ వెరీమచ్'' అంటూ శేఖర్ చేతిలోంచి మనీ తీసుకున్నాడు.

• • •

సినిమా కోసం ముస్తాబవుతోంది రతి. అది చూసి అత్తగారు ''అమ్మాయి, తయారవుతున్నావు ఎక్క డికి?''

''సినిమాకత్తయ్యా''

''మొన్ననే కదా వెళ్లారు!''

''నేనొద్దన్నానత్తయ్యా. కాని మీ అబ్బాయే...''

''వాడలాగే అంటాడు నువ్వైనా చెప్పొద్దు. ఇలా సిని మాలకి, షికార్లకి తగలేస్తుంటే నాలుగు డబ్బులు వెనకే సుకునేదెప్పుడు?''

''మొదలెట్టింది. కొత్తగా పెళ్లయింది. ఏదో సరదా పడుతున్నారు పిల్లలు అనుకోదు. 'నువ్వారా అత్తయ్యా' అంటే ఎగిరి గంతేస్తుంది'' గొణుక్కున్న ట్లుగా అంది రతి.

ఈల వేసుకుంటూ లోపలికి అడుగుపెట్టాడు రవి తేజ. అతని రాకతో రిలీఫ్ ఫీలయింది రతి. అతను ఆమెను సమీపించి ''త్వరగా కాఫీ ఇవ్వు టైమవు తోంది, వెళ్దాం'' అంటూ ఆమె బుగ్గమీద చిటికే శాడు.

భర్త హుషారును గమనించింది. కాని ఆ హుషారెందుకో అర్థం కాలేదు. అడుగుదామంటే అత్తగారుంది. 'తరువాత చెప్తాడులే' అనుకుంది. అతను తయారవగానే కాఫీ యిచ్చింది. కాఫీ తాగి ఇద్దరు బయలుదేరారు.

ఆటో కోసం చూస్తూ ''ఏ సినిమాకెళ్దాం?'' అడిగాడు.

''ఏదైనా పాత సినిమాకెళ్దామండి''

''పాత సినిమాకా! ఎందుకు?''

''పాత సినిమాకయితే హాల్లో జనం వుండరు. హాయిగా ఏ మూలైనా ఫ్రీగా కూర్చోవచ్చు.''

''ఆహా! వాట్ ఎ గుడ్ ఐడియా'' అంటూ శ్రీమతిని నెమ్మదిగా వెనుక గిల్లాడు.

''ఊరుకోండి. రోడ్డుమీద అందరు చూస్తారు'' అంటూ వారించింది.

ఖాళీ ఆటో రావటంతో ఎక్కి సినిమా హాలు చేరుకున్నారు. బాల్కనీ టికెట్స్ తీసుకుని లోనికెళ్లారు. సినిమా మొదలయింది. వాళ్లిద్దరూ తప్ప ఎవరూ లేరు ఆ బాల్కనీలో. అతని చిలిపి మాటలకు, చేతలకు హద్దే లేకుండా పోయింది. అప్పుడే సినిమా అయిపోయిందా అనిపించింది వాళ్లకి.

ఇంటికి తిరిగి వస్తూ మధ్యలో ''రేపు ఉదయమే మనం బయటికి వెళ్తున్నాం. ఏమీ మాట్లాడకుండా నాతో బయలుదేరు'' అన్నాడు.

''ఎక్కడికి? ఫ్రెండ్ ఇంటికా?'' అడిగింది.

''అవును''

కాదంటే యక్ష ప్రశ్నలు వేస్తుందని అలా చెప్పాడు.

• • •

మామూలుగా అయితే ఆదివారం ఉదయం ఎనిమిదికంటే ముందు లేచేవాడు కాదు రవితేజ. కాని ఆరోజు అతనిలోని బయలాజికల్ క్లాక్ అతన్ని ఆరింటికే లేపింది. అతనైతే త్వరగా తయారయి కూర్చున్నాడు. కాని రతి తెమలేద్దూ.

టిఫిన్ చేస్తూ అతను వాళ్లమ్మతో ''అమ్మా ఈరోజు రతి, నేను మా ఫ్రెండ్ ఇంటికి భోజనానికి వెళ్తున్నాము. సాయంత్రం వరకు వచ్చేస్తాం. వాళ్లు వుండమని మరీ బలవంతం చేస్తే రేప్రొద్దున్నే వస్తాము'' అని చెప్పాడు.

''అలాగే, వెళ్లిరండి'' అంది వాళ్లమ్మ.

''హమ్మయ్య'' అనుకుంది రతి.

''ఒ.కె. ఈలోగా నేవెళ్లి పూలు తెస్తాను'' అంటూ బైటకెళ్లాడు.

అతను తిరిగి వచ్చేసరికి ఆమె కొత్తచీరలో 'రతీదేవి'లా దర్శనమిచ్చింది. తలకు పోసుకుంది కాబోలు కురులన్నీ విచ్చుకున్నాయి. వదులుగా అల్లిన ఆమె జడలో మల్లెచెండు. తన్మయత్వంతో ఆమెని అలాగే చూస్తున్నాడు. సెలయేటి ఎదురుగా నిలబడి మంచినీటి కోసం పరితపిస్తున్నవాడిలా వుంది అతని పరిస్థితి.

'పదండి' అని ఆమె అనటంతో కదిలాడు.

ఆటో ఎక్కి 'మయూర లాడ్జి' అని చెప్పాడు డ్రైవరుతో. దానికి దగ్గరలో వాళ్ల ఫ్రెండ్ ఇల్లు వుందేమో అనుకుంది రతి. మాట్లాడకుండా ఆటో ఎక్కింది. ఆటో దిగుతూ 'ఫ్రెండ్ ఇంటికని చెప్పి లాడ్జికి తీసుకొచ్చాడు' అనుకుంది.

ఆటో చార్జిచేసి గబగబా రిసెప్షన్ వైపు నడుస్తున్నాడు. అయోమయంగా అతని వెనకాలే నడిచింది రతి. వేరే ఊరు నుండి విజిటింగ్ పర్పస్‌లో వచ్చినట్లు రిజిస్టర్‌లో వ్రాసి అడ్వాన్స్ పే చేశాడు. రూం కీ బాయ్‌కిస్తూ ''లగేజ్ ఇతనికివ్వండి తీసుకెళ్తాడు'' అంది లేడీ రిసెప్షనిస్టు.

లగేజి అనగానే ఇద్దరూ మొఖాలు చూసుకున్నారు. వెంటనే తేరుకుని ''లగేజి లేదు'' అన్నాడు.

వాళ్లవైపు అనుమానంగా చూసింది రిసెప్షనిస్టు. బాయ్ వాళ్ల రూమ్‌కు తీసుకెళ్లి, జగ్‌తో డ్రింకింగ్ వాటర్ తెచ్చి టేబుల్‌పై పెట్టాడు.

''కాఫీ, టిఫిన్ ఏమైనా కావాలా సార్?'' అని అడిగితే వద్దని చెప్పి వాడ్ని బైటికి పంపి తలుపు బోల్ట్ వేసి గట్టిగా ఊపిరి పీల్చాడు.



రతికి అంతా కొత్తగా వుంది. కొంచెం భయంగా వుంది. వచ్చి బెడ్ మీద కూర్చుంది. పరుపు మెత్తగా, హాయిగా వుంది.

ఉండదూ, రెండొందలు తగలేస్తే!

రిసెప్షన్‌లో రెండొందలివ్వడం చూసింది. అంతలోనే అది గుర్తొచ్చి ఆమెలో ఏదో బాధ. ఫ్రెండ్ ఇంటికని అబద్ధం చెప్పి లాడ్జికి తీసుకొచ్చిన భర్తను చూస్తుంటే అతనిపై కోపం.

ఆమె కళ్లెదుట-

లాడ్జ్-మెత్తటి పరుపు-రవితేజ.

ఆమెలో-

భయం-హాయి-బాధ-కోపం.

దగ్గరగా వస్తున్న అతనిని చూస్తూ ''ఏంటండీ, ఈ తిప్పలు ఎందుకు తీసుకొచ్చారిక్కడికి?'' గట్టిగానే అడిగింది.

''గట్టిగా అరవకు'' అంటూ ఆమెను లాక్కొని తన పెదాలతో ఆమె నోటిని మూశాడు. అతని చేతులు రతి వీణను శృతి చేశాయి. అతను మన్మధ రాగం పలికిస్తున్న వేళ టక టకమని తలుపు చప్పుడు. గాభరాగా లేచి ఇద్దరూ సర్దుకున్నారు. అతను వెళ్లి తలుపు తీశాడు.

ఎదురుగా బావమరిది మరియు తన ఫ్రెండ్ ప్రసాద్. వాళ్లను చూడగానే రవితేజకు అక్కడ హోటల్ రూంలో వున్నందుకు గిల్టీగా అనిపించింది. రతి ముఖమైతే భూమిలోకి కుంగిపోయింది. వాళ్ల బావమరిది ముందుగా తేరుకొని ''అమ్మకు చాలా సీరియస్‌గా వుంది. అక్కయ్యను తీసికెళ్దామని వచ్చాను. అత్తయ్య మీ ఫ్రెండ్ ఇంటికెళ్లారని చెప్పింది. వీరి అడ్రసు సంపాదించి వీరింటికి వెళ్లాను. వీరితో కలసి సిటీలో వున్న చాలా హోటల్స్‌కెళ్లాము. చివరకిక్కడికి వచ్చాము'' అన్నాడు.

''సారీరా'' అన్నాడు ప్రసాద్.

''ఫరవాలేదురా. నీదేం తప్పులేదు'' అన్నాడు రవితేజ.

అమ్మకెట్లా వుందో అని బోరున ఏడుస్తోంది రతి. రతిని ఓదార్చి పొదవి పట్టుకుని ఆమెని అక్కడి నుంచి తీసుకొని బయలుదేరాడు రవితేజ.

★